సాక్షి
బాపట్ల
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



క్యాలెండర్ ఆవిష్కరణ

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి శనివారం ఆవిష్కరించారు.



ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

గుంటూరుఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డీఈఓ పి.శైలజ శనివారం ఆవిష్కరించారు. బసవ లింగారావు, మొహ్మద్ ఖాలీద్ పాల్గొన్నారు.



మణికేశ్వరంలో జిల్లా జడ్జి పూజలు

అద్దంకి: మణికేశ్వరంలోని మల్లీశ్వరస్వామి దేవాలయంలో ప్రకాశం జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి డీ అమ్మనరాజా శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

నేడు స్పందన రద్దు

బాపట్ల అర్బన్: నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలందరికీ 2024 నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెప్పారు.

ఘనంగా వినాయకునికి సంకటహర చతుర్థి పూజలు

అమరావతి: అమరావతిలోని అమరేశ్వర స్వామి దేవాలయంలో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి పవిత్ర సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు జగర్లపూడి శాయి, కౌశిక చంద్రశేఖరశర్మ, సూర్యంలు స్వామివారికి వేకువజామున సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. స్వామి వారికి వివిధ రకాల ఆభరణాలతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లు సమర్పించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గ్రంథాలయ సెస్ బకాయిలు చెల్లించాలి

జేసీ రాజకుమారి

గుంటూరుఎడ్యుకేషన్: గ్రంథాలయ సెస్ బకాయిలు చెల్లించాలని జేసీ, గ్రంథాలయ సెస్సు కమిటీ చైర్‌పర్సన్ జి.రాజకుమారి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్లో గ్రంథాలయ సెస్సు బకాయిలపై గుంటూరు నగరపాలక సంస్థతో పాటు వివిధ మున్సిపాల్టీల కమిషనర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాలకు నగర, పురపాలక, పంచాయతీల నుంచి బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ నుంచి రూ.ఐదు కోట్లు, తాడేపల్లి-మంగళగిరి నగరపాలక సంస్థ నుంచి రూ.67 లక్షలు, తెనాలి మున్సిపాల్టీ నుంచి రూ.68 లక్షలు, గ్రామ పంచాయతీల నుంచి రూ.కోటీ 50 లక్షలు చొప్పున రావాల్సి ఉన్నాయని, వాటిని జనవరి 20వ తేదీలోపు జిల్లా కేంద్ర గ్రంథాలయానికి జమ చేయాలని స్పష్టం చేశారు. జీఎంసీ అదనపు కమిషనర్ శివజ్యోతి, డీపీవో కుసుమ శ్రీదేవి, జిల్లా ఆడిట్ అధికారి డి.ధనలక్ష్మి, మున్సిపాల్టీల రెవెన్యూ అధికారులు సోమేశ్వరయాదవ్, జె.వెంకటేశ్వరరావు, ఎం.బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య పాల్గొన్నారు.

బాలుడిపై వీధికుక్కల దాడి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వీధి కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడు గాయపడ్డాడు. హైదరాబాద్‌లో నివాసం ఉండే సీహెచ్ ఫణీ కుమారుడు కార్తీక్ కళ్యాణ్ సెలవులు నిమిత్తం గుంటూరు సంపత్‌నగర్‌లోని బాబాయ్ నాగరాజు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో శనివారం కార్తీక్ కళ్యాణ్, బాబాయ్ కొడుకు కరాటే క్లాస్‌కు వెళుతున్న సమయంలో వీధి కుక్కలు దాడి చేశాయి. వెంటనే అటుగా వెళుతున్న వాహనదారుడు స్పందించి ఆ కుక్కలను తరిమివేశాడు. కుక్కల దాడిలో బాలుడి వీపుపై గాయమైంది. వెంటనే బాలుడిని జీజీహెచ్‌కు తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం ఎటువంటి ప్రమాదం లేదని డాక్టర్లు చెప్పడంతో ఇంటికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ మధుసూదనరావు, ప్రజారోగ్యధికారులు నాగరాజు ఇంటికి వెళ్లి బాలుడిని పరామర్శించారు.

వీధి కుక్కల పట్టివేత

సంపత్‌నగర్‌లో బాలుడిపై వీధికుక్కల దాడి జరిగిన వెంటనే కమిషనర్ కీర్తి చేకూరి స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు వీధుల్లో తిరుగుతున్న వీధికుక్కలను ప్రజారోగ్యధికారులు పట్టుకుని యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేశారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గతంలో ఏటుకూరు రోడ్డులో వీధికుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు జరిగేవని, జంతు ప్రేమికులు దీనిని అడ్డుకుంటు కోర్టును ఆశ్రయించడంతో ఆపరేషన్లు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. త్వరలో కోర్టు ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

దొంగ ఓట్ల పనిపడుతున్నారు..

- జిల్లాలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు
- ఇప్పటివరకు 46,116 ఓట్ల తొలగింపు
- అత్యధికంగా పర్చూరు నుంచి 10,468 ఓట్లు
- రేపల్లె, అద్దంకి, చీరాలల్లోనూ అధికంగా అక్రమ ఓట్లు
- ఫారం-7 ద్వారా తొలగింపులు
- అడ్డుకునేందుకు టీడీపీ రాద్ధాంతం



ఫామ్-7 దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

సాక్షి ప్రతినిధి, బాపట్ల: టీడీపీ దొంగలు దొరికారు. ఓటరు జాబితాలను తమ మద్దతుదారులతో నింపేశారు. కొన్ని నియోజకవర్గాల్లో ఆ మద్దతుతోనే గెలిచేస్తున్నారు. ఈ మాయను వైఎస్సార్ సీపీ నాయకులు గుర్తించారు. పార్టీ నాయకులు ఫిర్యాదులతో ఎన్నికల కమిషన్ కదిలింది. జిల్లాలో కుప్పలు తెప్పలుగా ఉన్న దొంగ ఓట్లను తొలగించేందుకు అధికార యంత్రాంగం ఉపక్రమించింది.

ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో..

జిల్లాలో పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా దొంగ ఓట్లు ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు ఆ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త ఆమంచి కృష్ణమోహన్, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎన్నికల అధికారికి పలుమార్లు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని చీరాల, రేపల్లె, బాపట్ల, అద్దంకి, వేమూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న దొంగ ఓట్లతోనే టీడీపీ అభ్యర్థులు గతంలో విజయం సాధించారని, ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న దొంగ ఓట్లను తొలగించాలని అక్కడి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా కుప్పలు తెప్పలుగా వచ్చిన ఫారం-7 లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాను స్వయంగా గ్రామాలకు వెళ్లి విచారణ చేపట్టడంతోపాటు ఎన్నికల అధికారులను టీములుగా ఏర్పాటు చేసి దొంగ ఓట్లపై సమగ్ర విచారణ జరిపించారు. అలాగే కొత్త ఓట్ల నమోదు, దొంగ ఓట్లపై విచారణ అంశాలను నిత్యం రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశాలలో వారికి వివరిస్తూ వచ్చారు. దీంతో రాజకీయ పార్టీలతోపాటు ప్రజలకు ఫారం-6, ఫారం-7 లపై అవగాహన కలిగి గ్రామాలకు వచ్చిన అధికారులకు సహకరించారు. దీంతో అధికారులు అక్రమ ఓట్ల పై విచారణను త్వరితగతిన పూర్తి చేయగలిగారు.

ఓట్ల తొలగింపు ఇలా..

దొంగ ఓట్లపై వచ్చిన దాదాపు 80 వేల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. ఇప్పటి వరకు 46,116 నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఓట్లను తొలగించారు. అందులో అత్యధికంగా పర్చూరు నుంచి 10, 468 ఓట్లు తొలగించగా రేపల్లె పరిధిలో 8,880, చీరాల నుంచి 7,420, అద్దంకి పరిధిలో 7,207, వేమూరులో 6,295, బాపట్ల నుంచి 5,846 ఓట్లు చొప్పున మొత్తం 46, 116 ఓట్లను తొలగించారు. ఇందులో ఫారం-7 కు సంబంధించి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, అక్కడే స్థిరపడినవారు, చనిపోయినవారు, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు ఉన్నారు. ఇంకా కొన్ని దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తయితే మరికొన్ని దొంగ ఓట్లు బయటపడే అవకాశముంది.

టీడీపీ రివర్స్ ఎటాక్...



జిల్లాలో పర్చూరు, రేపల్లె, అద్దంకి నియోజకవర్గాల్లో అత్యధికంగా ఉన్న దొంగ ఓట్ల వల్లే ఆ పార్టీ అభ్యర్థులు గత ఎన్నికల్లో విజయం సాధించారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో నియోజకవర్గంలో పది నుంచి 20 వేలకు పైగా దొంగ ఓట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాలకు చెందిన వేలసంఖ్యలో ఓటర్లు హైదరాబాద్, విజయవాడ, గుంటూరు తోపాటు పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారందరి ఓట్లు వారున్న ప్రాంతాలతోపాటు పై నియోజకవర్గాల్లోనూ ఉన్నాయి. అంతేకాకుండా నియోజకవర్గంలో కూడా రెండు చోట్ల కొందరికి ఓట్లు ఉండటం గమనార్హం. ఇలాంటి ఓట్లు పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో అధికంగా ఉన్నాయి. ఇటీవల వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు ఎన్నికల అధికారులకు ఈ తరహా ఓట్ల వివరాలను ఆధారాలుగా చూపించారు. దొంగ ఓట్ల ఆరోపణల నుంచి బయటపడేందుకు టీడీపీ నేతలు అధికారపార్టీపై ఎదురు దాడికి దిగుతున్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అధికార పార్టీ దొంగ ఓట్లను చేరిపిస్తోందంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల అధికారులకు పదేపదే ఫిర్యాదులు చేయడంతో పాటు తోపాటు న్యాయస్థానాలకు వెళ్లి రచ్చ చేస్తున్నారు. ఎలాగోలా దొంగ ఓట్ల తొలగింపును అడ్డుకొని రాబోయే ఎన్నికల్లోనూ పబ్బం గడుపుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

ప్రకటనల మాయను అర్థం చేసుకోవాలి

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, పి.విజయబాబు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రకటనల మాయాజాలాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని ముందుకు సాగినప్పుడే నిత్య జీవితంలో వాటి ప్రభావం దూరమవుతుందని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కే హేమచంద్రారెడ్డి అన్నారు. సాహితీవేత్త డాక్టర్ వేంపల్లె షరీఫ్ పరిశోధనాగ్రంథం 'టీవీ ప్రకటనలు - భాషా సంస్కృతుల పరిశీలన' పుస్తకావిష్కరణ కార్యక్రమం పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యవేదికపై శనివారం సాయంత్రం జరిగింది. పుస్తకాన్ని ఆచార్య హేమచంద్రారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిజిటల్ మీడియా సామాన్య మానవుల జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. వినియోగదారులు ప్రకటనల్లోని అంతరాలను, మన మనసులపై వాటి ప్రభావాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఉత్పత్తికీ వందలాది ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉత్పత్తుల నాణ్యత కన్నా వినియోగదారుల భావోద్వేగాలను ప్రభావితం చేయడం ఉత్పత్తిదారులకు తప్పనిసరి అవుతోందన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధికార భాషాసంఘం అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడుతూ షరీఫ్ డాక్టరేటు పొందడం కోసం కాకుండా ఒక సామాజిక బాధ్యతతో పరిశోధన చేశారని అభినందించారు. మన జీవితాలపై వాణిజ్య ప్రకటనల మానసిక ప్రభావాన్ని అర్థం చేసుకోవడాని ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి అనిల్ డానీ మాట్లాడుతూ సామాన్య మానవులను ప్రతి రోజూ ప్రభావితం చేసే అంశంపై పరిశోధన చేసిన షరీఫ్ అభినందనీయుడని చెప్పారు. సాహిత్య విమర్శకులు నండూరి రాజగోపాల్ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధ్యక్షురాలు జి.అనిత పాల్గొన్నారు.

గాంధీజీ సిద్ధాంతాలు అవసరం...

నేటి ఆధునిక సమాజానికి గాంధీజీ సిద్ధాంతాలు చాలా అవసరమని మాజీ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవం ప్రాంగణంలో రాష్ట్ర గాంధీ స్మారకనిధి నిర్వహిస్తున్న స్టాళ్లను శనివారం బుద్ధప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదనీ, సామాజిక, ఆర్థిక విప్లవకారుడన్నారు. మాజీ హైకోర్టు జడ్జి కేజీ శంకర్, నిధి సభ్యురాలు జి.రశ్మి, పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షుడు మనోహర్ నాయుడు, గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ, ఎమెస్కో విజయకుమార్, సభ్యులు గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు

ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: నూతన సంవత్సర వేడుకల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్‌శాఖ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. మద్యం మత్తులో ఎవరైనా వాహనాలు నడిపితే అదుపులోకి తీసుకొని జరిమానా వేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆరుబయట మద్యం తాగడం, గుంపులు, గుంపులుగా తిరుగుతూ ఇతరులను ఇబ్బందులకు గురిచేసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బాణసంచా కాల్చడం, డీజే సౌండ్స్ ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని వివరించారు.

రైతు ఇంట సిరుల పంట

ప్రతి గింజా కొనుగోలు లక్ష్యం

- జిల్లాలో ప్రారంభమైన ధాన్యం కొనుగోలు
- నేరుగా మిల్లర్ల ప్రమేయాన్ని నియంత్రించే క్లస్టర్ వ్యవస్థకు శ్రీకారం
- 155 రైతు భరోసా కేంద్రాల్లో యంత్రాలు, పరికరాల ఏర్పాట్లు
- ఏ గ్రేడ్ క్వింటాకు రూ.2,203
- బీ గ్రేడ్ క్వింటాకు రూ.2,183
- తడిచినా, రంగుమారినా కొనుగోలుకు చర్యలు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బాపట్లటౌన్: ధనుర్మాసం రాకతో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. ఆరుగాలం కష్టించిన రైతన్నకు పంట చేతికొచ్చేరోజులు. పల్లె లోగిళ్లు ధాన్యం రాసులతో కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారు. విత్తే నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు అడుగడుగునా 'మద్దతు' ఇస్తున్నారు. ఈ ఖరీఫ్ రైతు ఇంట సంక్రాంతి సిరులు కురిపిస్తోంది. చివరిలో తుఫాన్ కొంత ఇబ్బంది పెట్టిన ప్రభుత్వ చొరవతో తట్టుకున్నారు. ప్రభుత్వం తడిచిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వరి సాగు ఇలా..

జిల్లాలో ఈ ఏడాది 2,08,798 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది ఆదినుంచి వర్షాలు సకాలంలో పడటంతో గతంలో కంటే ఈ ఏడాది ధాన్యం దిగుబడి ఆశాజనకంగా ఉంది. అధిక భాగం బీపీటీ 5204 రకం సాగుచేశారు.

ఆశాజనకంగా దిగుబడి..

బాపట్ల జిల్లాలోని 25 మండలాల పరిధిలో వరి సాగు చేశారు. వర్షాలు అనుకూలించడం, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని విధాలా సహాయం అందించడంతో సానుకూల ఫలితాలు వచ్చాయి. ఇప్పటి వరకు నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లో ఎకరానికి కనీసం 35 బస్తాలకు తగ్గకుండా దిగుబడి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో సుమారు 5.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

బీపీటీ 5204 రకానికి ప్రభుత్వ మద్దతు ధర కన్నా ప్రైవేట్ మార్కెట్‌లో ధర అధికంగా ఉండటంతో రైతులు ప్రైవేటుగా విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని 155 రైతు భరోసా కేంద్రాలకు ఇప్పటికే తేమ శాతాన్ని నిర్ధారించే యంత్రం, ధాన్యం తూకం వేసే యంత్రం, ధాన్యం నాణ్యతను నిర్ధారించే యంత్రాలను అందుబాటులో ఉంచారు.

క్లస్టర్ వ్యవస్థకు శ్రీకారం..

ధాన్యం కొనుగోలు వ్యవహారంలో రైస్‌మిల్లర్ల ప్రమేయాన్ని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ల వ్యవస్థను రూపొందించారు. ఈ క్లస్టర్లను మూడు కేటగిరిల్లో విభజించారు. రెండు వేల మెట్రిక్ టన్నులు దాటి కొనుగోలు చేసేవాటిని 'ఏ' కేటగిరిగా చేశారు. వీటికి గానూ క్లస్టర్‌కు నలుగురు క్షేత్ర సహాయకులను నియమించారు. వెయ్యి నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల వరకూ కొనుగోలు చేసే వాటిని 'బి' కేటగిరిగా, వెయ్యి మెట్రిక్ టన్నుల లోపు కొనుగోలు చేసేవాటిని 'సి' కేటగిరీగా విభజించారు.

పెరిగిన మద్దతు ధర

రైతులను ప్రొత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరను పెంచింది. గతంలో సాధారణ రకం క్వింటా రూ. 2040 ఉండగా ప్రస్తుతం రూ.2183 చేసింది. అదే విధంగా ఏ గ్రేడ్ రకం గతంలో రూ.2060 ఉండగా ప్రస్తుతం రూ.2203కు పెంచింది. రైతులు నేరుగా పండించిన ధాన్యాన్ని విక్రయించుకున్నట్లయితే రవాణా చేస్తే సంచికి రూ.3.39, రవాణాకు 8 కిలోమీటర్ల వరకు టన్నుకు రూ.295 చొప్పున, హమాలీ చార్జీలు క్వింటాకు రూ.17.17 చొప్పున లెక్కకట్టి మద్దతుధర చెల్లింపులతో పాటే నేరుగా రైతుల ఖాతాలకు జమ చేస్తారు. జిల్లాలో మొత్తం 78 మంది రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియలో భాగస్వాములవుతున్నారు. ఇప్పటికే 56 మంది రూ.50 కోట్ల విలువైన బ్యాంక్ గ్యారంటీలను సమర్పించారు.

ఇప్పటికే జిల్లాలో 806 టన్నులు కొనుగోలు..

ధాన్యం కొనుగోళ్లు జిల్లాలో ఈ నెల 8 నుంచి ప్రారంభించారు. ఇప్పటికి 107 రైతుల నుంచి 806 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వాటికి గానూ రూ.1.75 కోట్లు కేటాయించాల్సి ఉండగా వాటిల్లో ఇప్పటికే రూ.58 లక్షలు రైతుల అకౌంట్‌లో జమ చేశారు. ధాన్యం రవాణా చేసేందుకు జిల్లాలో 186 వాహనాలను గుర్తించి వాటికి జీపీఎస్ విధానం అమర్చారు. జిల్లా వ్యాప్తంగా 2.40 లక్షల గోనే అందుబాటులో ఉంచారు.

పర్యవేక్షణ ఇలా..

మరోవైపు ఆర్బీకేలతో రైస్ మిల్లులకు ధాన్యం సరఫరా అంశాలను నిరంతర పర్యవేక్షణకు, తనిఖీలు చేయడానికి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో తహసీల్దార్, ఎంపీడీఓ, పౌరసరఫరాలశాఖ డెప్యూటీ తహసీల్దార్‌తో పాటు డివిజనల్ సహకార అధికారలు ఈ కమిటీలో ఉంటారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), రైతు ఉత్పత్తి సంఘాలను భాగస్వామ్యం చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లకు డివిజన్, మండల స్థాయిలో ఇప్పటికే మూడుసార్లు శిక్షణ ఇచ్చారు.

మార్గదర్శకాలు ఇలా....

- రైస్‌మిల్లుల వద్ద కస్టోడియన్‌తో పాటు క్లస్టర్‌కు ముగ్గురు క్షేత్రసహాయకులు, ఒక టెక్నికల్ అధికారి ఉంటారు.
- రైతుల వద్దకు క్షేత్ర సహాయకులు వెళ్లి కొనుగోలు చేసే ధాన్యాన్ని పరిశీలించనున్నారు.
- నిబంధనల మేరకు ప్రమాణాలు సక్రమంగా ఉంటే టెక్నికల్ అధికారి సహాయంతో కొనుగోలు చేస్తారు.
- ధాన్యాన్ని ఎనాలసిస్ చేసే సమయంలో కొనుగోలు, రైస్ మిల్లుల వద్ద అన్‌లోడ్ చేసే ప్రాంతాల్లో ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని చివరగా మిల్లర్ల వద్ద ఉన్న కస్టోడియన్‌కు స్వాధీనం చేస్తారు. కస్టోడియన్ ఆ ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతి గింజా కొనుగోలు చేస్తాం. రైతులు దళారులకు ధాన్యం అమ్మవద్దు, చెల్లింపులు కూడా సత్వరమే జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో గోతాలు, ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పరిశీలించే పరికరాలను అందుబాటులో ఉంచాం. ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించవద్దు.

-వి.శ్రీలక్ష్మి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

ఆధునిక వ్యవసాయమే మేలు

- వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడి
- ఎన్జీ రంగా వర్సిటీలో రోబోటిక్ యంత్రాలపై వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ఎన్జీ రంగా వర్సిటీ వ్యవసాయ శాస్త్రవేత్తలు

బాపట్ల అర్బన్: వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్రాల వినియోగం అత్యవసరమని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యవసాయంలో రోబోటిక్స్ ఆవిష్కరణ అనే అంశంపై ఒకరోజు జాతీయ వర్క్ షాప్ శనివారం నిర్వహించారు. గుంటూరుకు చెందిన అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ డీన్ మణి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. జాతీయ వ్యవసాయ ఇంజినీరింగ్ పరిశోధనా స్థానం భోపాల్ డైరెక్టర్ డాక్టర్ సీఆర్ మెహతా, గుంటూరుకు చెందిన ఎన్జీ రంగా వర్సిటీ డీన్ కరుణాసాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్లో కూలీల లభ్యత ప్రధాన సమస్యగా మారిందని చెప్పారు. దీనిని అధిగమించటానికి వ్యవసాయంలో అన్ని రకాల పనులకు ఆధునిక రోబోటిక్ యంత్రాల అవసరం చాలా ఉందని వివరించారు. వీటిపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాసరెడ్డి, ఐ.శ్రీనివాస్, రామిరెడ్డి, హరిబాబు, వీరప్రసాద్, విజయ్ కుమార్, బీ రాజ్ కిరణ్, ఎం.మాధవ, లావణ్య, కృపావతి, విష్ణువర్ధన్, ఆర్.గణేష్ బాబు, రత్నరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంలో మోనూ తప్పనిసరి

ఎమ్మెల్సీ పోతుల సునీత

వేటపాలెం: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మోనూ తప్పనిసరిగా పాటించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత కోరారు. మండలంలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మోనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా వాకబు చేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రీడా మైదానంలోని ఆటల పోటీలను పరిశీలించారు. విద్యార్థులకు క్రికెట్ కిట్‌లు అందజేశారు. అనంతరం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని బండ్ల బాపయ్య హిందూ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోతుల సురేష్ పాల్గొన్నారు.

కాలువలో పడి రెండేళ్ల బాలుడు మృతి



చీరాల: సముద్రం ఒడ్డున ఆడుకుంటున్న రెండేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు చిన్న కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం వేటపాలెం మండలం రామాపురంలో చోటుచేసుకుంది. వివరాలు.. వేటపాలెం మండలం రామాపురానికి చెందిన వాయల రాంబాబు అతడి భార్య ఇద్దరూ సముద్రం ఒడ్డున వల పనిచేసుకుంటున్నారు. వారితో పాటు వచ్చిన కుమారుడు అర్జునరావు(2) ఆడుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న పిల్లకాలువలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం రూరల్ ఎస్ఐ జనార్దన్ హాస్పిటల్‌కు వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

మద్యం స్వాధీనం

తాడికొండ: మండల పరిధిలోని పొన్నేకల్లు వద్ద ఇతర రాష్ట్రాల మద్యం స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను మంగళగిరి ఎస్ఈబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హర్యానా నుంచి మద్యం బాటిల్స్ తీసుకుని వచ్చి ఇక్కడ విక్రయాలు చేస్తున్న ముగ్గురు నిందితులను మంగళగిరి ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు ఆధ్వర్యంలో, ఎస్ఐ మల్లికార్జునరావు తన సిబ్బందితో కలసి పక్కా సమాచారంతో స్వాధీనం చేసుకున్నారు. పి.గోపి రాజు అనే వ్యక్తి ఆర్మీలో విధులు నిర్వహిస్తుంటాడు. అతని బావమరిది చిన్నం అమర్నాథ్, మువ్వ శ్రీకాంత్‌లతో కలిసి 60 మద్యం బాటిల్స్‌ను తీసుకొని వచ్చి తాడికొండ పరిధిలో అమ్మకాలు చేస్తుంటాడు. వీరిని పట్టుకుని వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ సూపరింటెండెంట్ అడ్మిన్ కె.సుప్రజ తెలిపారు. 60 మద్యం బాటిల్స్ (750 ఎంఎల్), ఖరీదు రూ.లక్షపైనే ఉంటుందని తెలియజేశారు. దాడులలో ఎస్ఈబీ సిబ్బంది ఈసీ శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సామర్థ్యం పెంచాలి

- కొత్త టవర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- ప్రైవేట్ సంస్థలతో పోటీ పడాలి
- 4జీ సేవలను మరింతగా పెంచాలి
- టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



టెలికం అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నెహ్రూ నగర్: బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సామర్థ్యం పెంపుదలతో ప్రజల ఆదరణ పొందవచ్చని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. చంద్రమౌళి నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గుంటూరు జిల్లా 3వ టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మరిన్ని సిగ్నల్ టవర్‌లు పెంచాలని కోరారు. పల్నాడులో సిగ్నల్స్ పెరిగేలా మరింత దృష్టి సారించాలని సూచించారు. సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే కేంద్రం వద్ద తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 729 టవర్‌లలో 104 మాత్రమే 4జీ సర్వీస్‌లు ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అభివృద్ధికి దేశ వ్యాప్తంగా రూ.89,000 కోట్లని మంజూరు చేసి ప్రోత్సాహం ఇస్తుంటే.. అధికారులు ఎందుకు అభివృద్ధి బాటలో ఉండటం లేదని ఎంపీ ప్రశ్నించారు. మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఎక్కువగా నిధులు వాడుకొని బీఎస్ఎన్ ఎల్‌ను అభివృద్ధి చేస్తుంటే మన రాష్ట్రంలో వెనుకబాటులోనే ఉంటున్నామని అన్నారు. గ్రామాల్లో ఇళ్ల మధ్య టవర్ పెట్టడం ఇబ్బందిగా ఉంటే.. ప్రభుత్వ బిల్డింగ్ లు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, పీహెచ్‌సీ, స్కూల్స్ బిల్డింగ్‌ల పైన పెట్టాలని సూచించారు. ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి తగిన సలహాలు, సూచనలు అందించారు. సీనియర్ సభ్యుడు నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన గుంటూరు నగరంలోని అనేక ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని, దీని వల్ల కూడా కస్టమర్ కేర్ సెంటర్ల నుంచి సరైన సమాధానం లభించడం లేదన్నారు. కార్యక్రమంలో డీజీఎం(ప్లానింగ్) శ్యామ్ ప్రసాద్, డీజీఎం(ఆపరేషన్స్) వెంకటేశ్వరరావు, ఏజీఎం (అడ్మినిస్ట్రేషన్) ప్రసన్న కుమార్, బీఎస్ఎన్ఎల్ గుంటూరు జనరల్ మేనేజర్ శ్రీధర్, టెలికం అడ్వైసరీ కమిటీ మెంబర్స్ కోటేశ్వరరావు, రవీంద్ర రెడ్డి, ఉదయభాస్కర్, కాకర్ల వెంకటేశ్వరరావు, కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వమతాల సారాంశం ఒక్కటే

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి



హనిమిరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

బల్లికురవ: సర్వమత సారాంశం ఒక్కటేనని.. భగవంతుని దృష్టిలో అందరూ సమానమేనని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని వెలమవారిపాలెం, పంచాయతీలోని చినజమ్ములమడక చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. పాస్టర్ ఏసోబు ఆశీర్వాదం అందించారు. నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. వెలమవారిపాలెం గ్రామానికి తొలిసారి వచ్చిన హనిమిరెడ్డికి గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం కొత్త జమ్ములమడక కాలనీలో అనారోగ్యంతో చనిపోయిన చిట్లూరి ఏమేలమ్మ(72) కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమాల్లో సర్పంచి, మాజీ సర్పంచి నూనె ప్రభుదాస్, ఎం.తిరుపతి దానయ్య, మామిళ్లపల్లి చిరంజీవి రావు, నూనె దేవదాసు, రమేష్ పాల్గొన్నారు.

యువతకు ఎంతో మేలు 'ఆడుదాం ఆంధ్రా'

- ప్రత్యేకంగా నిధులు కేటాయించాం
- యువతలో ఉన్న ప్రతిభను కనబరిచేలా ఆటల పోటీలు జరుగుతున్నాయి
- ఏపీ స్పోర్ట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న



ఆటలను తిలకిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

తాడేపల్లిరూరల్: ఆడుదాం ఆంధ్రా – ఇది అందరి ఆట యువతీ యువకులకు ఎంతో మేలు చేస్తుందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రత్యేక నిధులు కేటాయించిందని ఏపీ స్పోర్ట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న వెల్లడించారు. శనివారం ఉండవల్లి దేవదాయ శాఖ భూముల్లో జరుగుతున్న ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా ఆటస్థలంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కబడ్డీ, క్రికెట్ పోటీలు జరుగుతుండటంతో డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, ఎంటీఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావుతో కలసి తిలకించారు. మ్యాచ్ అనంతరం క్రికెట్ ఆడిన వారితో కలసి ఆయన క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ప్రద్యుమ్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా అందరి ఆట అనే కార్యక్రమాన్ని గ్రామ, వార్డు, సచివాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తోందని, మొత్తం 125 కోట్ల రూపాయల నిధులు కేటాయించామని, ఇందులో 12 కోట్ల రూపాయలు ప్రైజ్ మనీగా అందజేస్తున్నామన్నారు. ఆటల పోటీలు నిర్వహించే సమయంలో ఆ క్రీడకు సంబంధించిన ఆట వస్తువులను ప్రభుత్వమే అందజేస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని సచివాలయాల పరిధిలో క్రీడలలో పాల్గొనేందుకు యువతీ యువకులు పోటీ పడుతున్నారు. ఐదుస్థాయిల్లో జరిగే ఈ క్రీడలు 45 రోజుల పాటు ప్రభుత్వం నిర్వహిస్తోందని, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

లైంగిక దాడి కేసులో వ్యక్తికి జైలు

చుండూరు(వేమూరు): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ బాపట్ల జిల్లా 6వ అదనపు కోర్టు జడ్జి, తెనాలి ఇన్‌చార్జి కె.బాలాజీ శుక్రవారం తీర్పునిచ్చారు. చుండూరు ఇన్‌చార్జి ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలు.. చుండూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్ చెందిన కె.రత్నరాజు(32) అదే గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడే విధంగా ఆధారాలు స్వీకరించి, కోర్టులో పత్రాలు సమర్పించిన చుండూరు పోలీసులను ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం అభినందించారు.

బీటీఏ డైరీ ఆవిష్కరణ



పొన్నూరు: బహుజన టీచర్స్ అసోసియేషన్ అసోసియేషన్ 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. మనోజ్ కుమార్, చిట్టేటి రమేష్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని దళిత మహాసభ వ్యవస్థాపకులు కత్తి పద్మారావు నివాసంలో పద్మారావు డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. డైరీలో సామాజిక ఉద్యమకారులు చేసిన గొప్ప కార్యక్రమాలు ముద్రించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి.వెంకటరావు, పల్లం వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి

జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు



బల్లికురవ సెక్రటరీతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు

బల్లికురవ: గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు, ఇంటి పన్ను వసూళ్లు, గ్రానైట్ సీనరేజ్, చెరువుల ద్వారా ఆదాయ వనరులు పెంచుకుని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు కోరారు. శనివారం బల్లికురవ వచ్చిన ఆయన గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. బల్లికురవ గ్రానైట్‌కు అంతర్జాతీయ స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, గ్రానైట్ ఎగుమతుల్లో సీనరేజ్ ద్వారా గ్రామ పంచాయతీ, మండల పరిషత్ జిల్లా పరిషత్‌లకు పర్సంటేజ్ ద్వారా ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ప్రభుత్వం అక్రమ ఎగుమతులు అడ్డుకట్ట వేసేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయటం వలన ఆదాయం పెరిగిందన్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ, ఏ రెవెన్యూల్లో ఉంది.. ఏఏ గ్రామ పంచాయతీలకు ఆదాయం దక్కుతుందో రికార్డుల పరంగా రాంబాబు తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామాల్లోనే పౌరసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న వివిధశాఖల ఉద్యోగులు బాధ్యతలు గుర్తెరిగి అంకిత భవంతో పనిచేయాలని కోరారు. తనిఖీ సమావేశంలో ఈఓపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

ఆరు గ్రానైట్ లోడు లారీలు స్వాధీనం



మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

మార్టూరు: ఎలాంటి అనుమతులు లేకుండా గ్రానైట్ ముడిరాయి శ్లాబులు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ఆరు వాహనాలను శనివారం మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వీరేష్ అందించిన వివరాలు.. నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్‌రాయి తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో మైనింగ్ అధికారులు శనివారం తెల్లవారుజామున మార్టూరులో నిఘా పెట్టారు. స్థానిక నాగరాజుపల్లి సెంటరు నుంచి రాజుపాలెం మధ్యలో జాతీయ రహదారిపై తనిఖీ నిర్వహించారు. అధికారులకు ఎటువంటి బిల్లులు లేకుండా గ్రానైట్ శ్లాబులు తరలిస్తున్న నాలుగు లారీలు ముడిరాయి తరలిస్తున్న రెండు లారీలు మొత్తం ఆరు వాహనాలను గుర్తించి అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న మెటీరియల్ వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేశామని, వారి నుంచి వివరాలు వచ్చాక స్వాధీనం చేసుకున్న శ్లాబులు, ముడిరాయి విలువను తెలియజేస్తామని ఏడీ తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ ఆర్ఐ మురళీ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ

డీఈఓ రామారావు



మాట్లాడుతునన డీఈఓ రామారావు

చినగంజాం: చదువులో వెనుకబడిన విద్యార్థినులపై శ్రద్ధ చూపాలని డీఈఓ పీవీజే రామారావు సూచించారు. మండలంలోని కస్తూరిబా బాలికా విద్యాలయాన్ని శనివారం సందర్శించారు. 6 నుంచి 10వ తరగతి వరకు అన్ని తరగతులను సబ్జెక్టుల వారీగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం అందించాలని సూచించారు. వార్షిక తనిఖీలో ప్రత్యేక సబ్జెక్ట్ ఉపాధ్యాయుల ద్వారా అన్ని తరగతులను తనిఖీ చేశారు. పది, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సమగ్ర శిక్ష పీడీ సూచించిన పంచతంత్ర షెడ్యూల్‌ను అమలు చేయాలని కోరారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మంచి గ్రేడులు సాధించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమాంజలి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై సర్పంచికి షోకాజ్ నోటీసులు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై టీడీపీ సర్పంచి బాలిగ శివపార్వతికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ టీడీపీ ఆధిపత్యంతో సర్పంచులు ఎన్నికవుతున్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్ల వరకు నిధులు దారిమళ్లించినట్లు సమాచారం. 2018 నుంచి 2023 వరకు ప్రత్యేక అధికారుల పాలన, సర్పంచుల పాలనలోను సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా దుర్వినియోగం అయినట్లు ఆరోపణలున్నాయి. 7వ వార్డు టీడీపీ సభ్యురాలు పీ ఆదిలక్ష్మి నవంబర్ 20వ తేదీన కారంచేడులో కలెక్టర్ నిర్వహించిన స్పందనలో పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బాపట్ల డీపీఓ రాంబాబు చీరాల డీఎల్‌పీఓను ఫిర్యాదుపై పూర్తిస్థాయి విచారణ చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. దీనిపై డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు. ఆయన నివేదికను సిద్ధం చేసి డీపీఓకు అందించారు. నివేదిక ఆధారంగా రూ.78.49 లక్షల నిధులు మంజూరయ్యాయని, దీనిపై డీపీఓ కారంచేడుకు చెందిన టీడీపీ సర్పంచి బాలిగ శివపార్వతికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆమె భర్త, బంధువుల బ్యాంక్ ఖాతాలకుపై నిధులు జమ అయినట్లు నివేదికలో పేర్కొన్నారు.